

నారాయణ స్పోర్ట్స్‌మీట్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

విద్యార్థులు క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలి

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్‌లోని నారాయణ స్కూల్ జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్‌లు హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఎంచుకున్న రంగంలో రాణిం చాలన్నారు. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతులను చేయటం కోసం ఇలాం టి జోనల్ స్పోర్ట్స్ ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. అనంతరం క్రీడల్లో గెలు పొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి, జోనల్ ఏజీఎం రవీంద్ర బాబు, ప్రినిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జడ్సీకి వినతిపత్రం ఇస్తున్న నాగోల్ కార్పొరేటర్ అరుణాసురేందర్‌యాదవ్

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

● జడ్సీకి నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ వినతి

మన్సూరాబాద్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో వీధి దీపాల ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని స్థానిక కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కోరారు. ఈ మేరకు జోనల్ కార్యాలయంలో శుక్రవారం జడ్సీని మర్యాదపూర్వకంగా కలిసిన ఆమె సమస్యలను వివరించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రధానంగా డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్‌కాలనీలో నివాసితులు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అక్కడ వెంటనే సీసీరోడ్డు నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్, హనుమాన్‌నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

మన్సూరాబాద్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, ప్రజల ఆరోగ్యంపై దృష్టిసారించి తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు వేముగంటి సంపత్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం జోనల్ కార్యాలయంలో జడ్సీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా లేనందున ఈగలు, దోమలు తీవ్రంగా వ్యాప్తి చెందుతూ ప్రజలను మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి రోగాల బారిన పడేలా చేస్తున్నాయన్నారు. జడ్సీకి వినతిపత్రం ఇచ్చిన వారిలో బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు ఉన్నారు.

కాలనీల్లో సమస్యల పరిష్కారానికి సహకరించండి

కొత్తపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సహకరించాలని ఎల్బీనగర్ జడ్సీ హేమంత్ పాటిల్‌కు కార్పొరేటర్ పవన్‌కుమార్ విన్నవించారు. శుక్రవారం ఆయన జడ్సీని కలిసి కాలనీల సమస్యలను వివరించారు. భరత్‌నగర్-1, మారుతీనగర్ శ్వేతాగార్డెన్ ఎదురుగా ఉన్న రోడ్డు సహా ఓల్డ్ మారుతీనగర్ గురు మందిర్ దారి పాడయ్యాయని, మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. పలు కాలనీల్లో వీధి దీపాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అసౌర్యానికి గురవుతున్నారని తెలిపారు. అనంతరం ఆయన జడ్సీ హేమంత్ పాటిల్‌కు వినతిపత్రం సమర్పించారు.



జడ్సీ హేమంత్ పాటిల్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ పవన్

వినికిడి చికిత్స శిబిరానికి విశేష స్పందన

వనస్థలిపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం పనామా రోడ్డులోని హియర్ వెల్ స్పీచ్ అండ్ హియరింగ్ చికిత్స ఈనెల 22 నుంచి 24 వరకు నిర్వహిస్తున్న ఉచిత వినికిడి వైద్య శిబిరానికి కాలనీవాసుల నుంచి విశేష స్పందన లభిస్తుంది. ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు వంద మంది వినికిడి సమస్యలతో బాధపడుతున్న వారికి వినికిడి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గంజి శ్రీలత, డాక్టర్ నాగకిరణ్‌లు మాట్లాడుతూ కాలనీవాసుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న ఉచిత వినికిడి వైద్య శిబిరాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9703235513, 9985631926 నంబర్లను సంప్రదించాలన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలి: లచ్చిరెడ్డి

వనస్థలిపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్‌లోని సెల్ఫ్‌ఫైనాన్స్ కాలనీలో జరుగుతున్న రోడ్డు పనులను జీహెచ్ఎంసీ డీఈ దామోదర్‌తో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీల్లో జరుగుతున్న రోడ్డు పనులు నాణ్యతా లోపాలు లేకుండా భవిష్యత్ తరాలకు ఉపయోగపడేవిధంగా నాణ్యతతో చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు, నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలలో ఉన్న వ్యక్తిపై మాజీ రౌడీషీటర్ దాడి

● ఎల్బీనగర్ పీఎస్‌లో కేసు నమోదు

కొత్తపేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మాజీ రౌడీ షీటర్ అయ్యప్ప మాలలో ఉన్న వ్యక్తిపై దాడి చేసిన సంఘటన ఎల్బీనగర్ పీఎస్ పరిధి ఆర్టీసీ కాలనీలోని బాలాజీ మెస్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం బాలాజీ మెస్ యజమాని సురేష్‌కు మాజీ రౌడీషీటర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డికి మధ్య గొడవ జరిగింది. సురేష్ అయ్యప్ప మాలలో ఉన్నారు. మెస్‌లో పనిచేసే వారిమధ్య స్వల్ప వివాదం చోటు చేసుకోవడంతో సురేష్‌స్వామి సహా అందరూ మాట్లాడుకుంటున్నారు. అదే సమయంలో కుంభం శ్రీనివాస్‌రెడ్డి అక్కడికి చేరుకుని త్రిశూలంతో దాడి చేశాడు. సురేష్‌స్వామి మనోభావాలు దెబ్బ తినేలా, దుర్భాషలాడుతూ అడ్డువచ్చిన మెస్ పనివారిపైనా, మహిళలపైనా దాడి చేశాడు. దాడి దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. తొలుత ఈ దాడి సీసీ దృశ్యాలను సోషల్‌మీడియాలో వైరల్ చేశారు. బాధితుడి ఫిర్యాదుతో ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మెస్ యజమాని పుబ్బాల సురేష్‌పై దాడి చేస్తున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి

మలక్‌పేట మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు ప్రారంభం

ఓల్డ్‌మలక్‌పేట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం మిర్చి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. రైతులకు కొత్త పంట చేతికి రావడంతో అమ్ముకోవడానికి మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. మార్కెట్‌లో అధికారులు పంట కొనుగోలును ప్రారంభించారు. నాలుగైదు రోజులుగా మిర్చి మార్కెట్‌కు వస్తుంది. నవంబరు నుంచి వచ్చే సంవత్సరం ఏప్రిల్ వరకు అమ్మకాలు సాగుతాయి. ఈసారి పంట దిగుబడి అధికంగా ఉండడంతో పెద్దఎత్తున పంట మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది. అందుకు అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మార్కెట్‌కు తెచ్చిన పంట అమ్మకంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పారదర్శకంగా కొనుగోలు జరిగేలా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ నామ్ ద్వారా ఆన్‌లైన్ అమ్మకాలు చేపట్టారు. పంట కొనుగోలులో జాప్యం లేకుండా ఏరోజు తెచ్చిన పంటను అదే రోజు కొనేలా చర్యలు చేపట్టారు. రైతులు మార్కెట్‌లో పంట అమ్ముకోవడానికి రోజుల తరబడి వేచిచూడకుండా తక్షణ కొనుగోలు జరపాలని కమీషన్ ఏజెంట్లకు ఆదేశాలు జారీచేశారు. మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌కు ఉల్లి తర్వాత మిర్చి పంట అధికంగా వస్తుంది. రాష్ట్ర రాజధాని కావడంతో కొనుగోలులో జాప్యం ఉండదని పంటకు మంచి రేటు కూడా వస్తుందని రైతులు దూరం నుంచి కూడా ధాన్యాన్ని ఈ మార్కెట్‌కు తెస్తుంటారు. ఎక్కువగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వరంగల్, ఖమ్మం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని పిడుగురాళ్ల, జంగారెడ్డిగూడెం, మాచర్ల ప్రాంతాల నుంచి పంట వస్తుంది. ఈసారి పంట ధర ఆశాజనకంగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు. ప్రస్తు తం నంబర్ వన్ తేజ రకం ఒక క్వింటా రూ.14వేలు ధర పలుకుతుంది. రెండవ రకం రూ. 9వేలు, మూడో రకం రూ.5వేలు పలుకుతుంది.



మార్కెట్‌లో మిర్చి కొనుగోలు చేస్తున్న దృశ్యం

గ్రేడింగ్ చేసి పంటను తీసుకు రావాలి



రైతులు పంటను మార్కెట్‌కు తెచ్చే ముందు తేమలేకుండా ఎండబెట్టి చెత్తాచెదారం లేకుండా గ్రేడింగ్ చేసి తీసుకురావాలి. తద్వారా మంచి రేటు వస్తుంది. గ్రేడింగ్ చేయకుంటే సరైన రేటు రాదు. గ్రేడింగ్ చేసిన పంట ద్వారా రైతుకు ఆశించిన ధర లభిస్తుంది. నాణ్యత తక్కు వ ఉన్న పంటకు తక్కువ ధర వస్తుంది. మార్కెట్‌లో మిర్చి కొనుగోలు ప్రారంభమైంది. పంట అమ్ముకోవడానికి రైతులకు అన్ని ఏర్పాట్లు చేశాం.

● దామోదర్ సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ

మాలల సింహగర్జనను జయప్రదం చేయాలి

● తెలంగాణ మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకిషన్

ఎల్‌బీనగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో డిసెంబర్ 1న లక్షలాది మందితో జరుగనున్న మాలల సింహగర్జనను జయప్రదం చేయాలని తెలంగాణ మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ పిలుపునిచ్చారు. శుక్రవారం సరూర్‌నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సింహగర్జన పోస్టర్‌ను గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా బ్యాగరి, కాటి కాపరుల సంఘం నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి తెలంగాణలో ఉన్న 50 లక్షల మంది మాలలు అహోరాత్రులు కష్టపడ్డ విషయాన్ని రేవంత్‌రెడ్డి మర్చిపోకూడదన్నారు.

గత శాసనసభ, పార్లమెంటు ఎన్నికల్లో మనువాద భారతీయ జనతా పార్టీకి మాదిగలందరూ ఓట్లు వేయాలని కాంగ్రెస్‌ను ఓడించాలని చెప్పిన మందకృష్ణ మాదిగ మాటలు నమ్మి మాలలకు మోసం చేస్తే తెలంగాణ రాష్ట్రంలో రాజకీయాలు మారుతాయన్నారు. తెలంగాణలో ఉన్న తొమ్మిది మంది మాల ఎమ్మెల్యేలు వర్గీకరణకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఏమాత్రం దళితుల మీద ప్రేమ ఉంటే ఇప్పుడున్న ఎస్సీ రిజర్వేషన్లను 15 శాతం నుంచి 25 శాతానికి పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. మాలలకు ప్రత్యేకంగా మాల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి వెయ్యి కోట్లు నిధులు విడుదల చేసి బడ్జెట్‌లో పొందుపర్చాలని ఆయన కోరారు. మహేశ్వరం నియోజకవర్గం నుంచి వేలాది మంది ఒకటో తేదీన జరిగే బహిరంగ సభకు హాజరుకావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా మాల బ్యాగరి కాటికాపర్ల సంఘం ప్రధాన కార్యదర్శి పద్మాకర్, మాల బ్యాగరి కాటికాపరి సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాలల సింహగర్జన పోస్టర్‌ను విడుదల చేస్తున్న తెలంగాణ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకిషన్ తదితరులు



ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను కలిసిన వీఎంహోం పూర్వ విద్యార్థులు

జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలి

● ఎమ్మెల్సీ కోదండరాంను కోరిన పూర్వ విద్యార్థులు

ఎల్‌బీనగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అనాథ పిల్లలకు పదవ తరగతి తర్వాత ఇంటర్, డిగ్రీ చదువుకోడానికి ప్రభుత్వం హాస్టల్ వసతితో కూడిన జూనియర్, డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని వీఎంహోం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను కోరారు. శుక్రవారం వీఎంహోం పూర్వ విద్యార్థులు కోదండరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు భీమగాని మహేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలు పదవ తరగతి వరకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వీఎంహోంలో చదువుకున్న తర్వాత హోం నుంచి అర్థాంతరంగా బయటకు పంపడంతో అనాథ పిల్లలు దిక్కుతోచని స్థితిలో ఉంటున్నారన్నారు. ఇంటర్ చదివేందుకు జూనియర్ కళాశాల లేక ఎంతో మంది విద్యార్థులు చదువును మధ్యలోనే ఆపివేస్తు రోజు కూలీలు, కార్మికులుగా మారుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వీఎంహోం పరిరక్షణకు కృషి చేసిన ప్రొఫెసర్ కోదండరాం ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆయన కోరారు. వీఎంహోంలో పర్మినెంట్ టీచర్ ఒక్కరే ఉండడంతో విద్యార్థుల చదువు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. తక్షణమే పర్మినెంట్ టీచర్లను నియమించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆయన కోరారు. వీఎంహోంలో వృత్తివిద్యా కోర్సులు వెంటనే ప్రారంభించేలా చూడాలని ఆయన కోరారు. వీఎంహోం పూర్వ విద్యార్థుల సంఘం ఉపాధ్యక్షుడు కేతావత్ సాగర్, భాస్కర్, గణేష్, విఠల్, మల్లేష్, అశోక్, టీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి వినయ్‌కుమార్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

సైదాబాద్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనసూయ అన్నారు. పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మలక్‌పేట బాలికల జూనియర్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 11నెలలు గడిచినా నేటికి విద్యారంగ సమస్యలపై దృష్టి సారించకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు రాకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యే పరిస్థితి ఉందని తెలిపారు. ప్రైవేట్ యాజమాన్యాలు విద్యార్థులను వేధింపులకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయకపోవడంతో చిన్న తరహా ప్రైవేటు డిగ్రీ కళాశాలలు మూతకు గురవుతున్నాయని అన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, గౌతం, రహీం, నవ్య, సంధ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ, పక్కన పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్

క్రీడల్లో మన దేశం వెనకబడడం శోచనీయం

● వ్యవసాయ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జానయ్య

రాజేంద్రనగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అధిక జనాభా ఉన్న భారతదేశం క్రీడల్లో వెనకబడి ఉండడం శోచనీయమని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఈ పోటీల్లో 11 కళాశాలలకు చెందిన 415 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఓవరాల్ చాంపియన్లుగా బాల బాలికల విభాగంలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల నిలిచింది. అథ్లెటిక్స్‌లో వ్యక్తిగత విభాగంలో బాలురు, బాలికల విభాగంలో అశ్వారావుపేటకు చెందిన కె.అనిల్ కుమార్, ఎం.రచన చాంపియన్‌లుగా నిలిచారు. బహుమతి ప్రదానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జానయ్య మాట్లాడుతూ అన్ని విద్యా విధానాలు క్రీడల ప్రాధాన్యతను నొక్కి చెబుతున్నప్పటికీ దానికి తగిన ఆచరణ ఉండడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం సంతోషమన్నారు. క్రీడల వల్ల విద్యార్థుల్లో ఐక్యత, పాజిటివ్ ఆలోచనలు, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి.నరేందర్‌రెడ్డి, యూనివర్సిటీ అబ్జర్వర్, హెడ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ జె.సురేష్, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ జిల్లా సత్యనారాయణ, డీన్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ డాక్టర్ ఎ.విజయలక్ష్మి, డాక్టర్ ప్రశాంత్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఓవరాల్ చాంపియన్లుగా నిలిచిన రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులతో వీసీ ప్రొఫెసర్ జానయ్య తదితరులు

యువకుడి హత్యకేసులో తొమ్మిది మంది అరెస్టు

● కత్తి, ద్విచక్రవాహనం, 7సెల్‌ఫోన్లు స్వాధీనం

సంతోష్‌నగర్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పాత కక్షలతో యువకుడిని హత్య చేసిన కేసులో సంతోష్‌నగర్ పోలీసులు ఇద్దరు నిందితులకు, ఏడుగురు మైనర్లకు ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించి శుక్రవారం వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఒక కత్తి, 7మొబైల్ ఫోన్లు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. సంతోష్‌నగర్ ఎంబిహట్స్‌కు చెందిన మహ్మద్ మోహిత్‌ఖాన్(18)ను బుధవారం హత్య చేయగా శుక్రవారం హత్య కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

ఫార్మా రంగంలో మెరుగైన అవకాశాలు

● జేఎన్‌టీయూ కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ రమాదేవి

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 22(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లిలోని అవంతి కళాశాల బీఫార్మసీ, ఫార్మా డీ విద్యార్థుల ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూ కెమిస్ట్రీ విభాగాధిపతి, ప్రొఫెసర్ రమాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల చైర్మన్ ముత్యంశెట్టి శ్రీనివాస్‌రావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో విద్యార్థులకు మెరుగైన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. క్రమశిక్షణతో చదువుకుని మంచి ఫార్మా కంపెనీలో ఉద్యోగాలు పొందాలని ఆకాక్షించారు. ధాత్రి హెల్త్‌కేర్ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంతో పోలిస్తే ప్రస్తుతం ఫార్మా కోర్సులకు మంచి డిమాండ్‌తో పాటు గుర్తింపు లభిస్తుందన్నారు. ఉద్యోగ అవకాశాలు కూడా ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. కళాశాల చైర్మన్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి ప్రతినిధి కవిత, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలాజీ, స్వామిరావు, క్యాంపస్ ఇన్‌చార్జి బోసుబాబు, పీఆర్‌వో శ్రీనివాస్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాశాల చైర్మన్ శ్రీనివాస్‌రావు, పక్కన ప్రొఫెసర్ రమాదేవి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలోని మరమ్మతు పనుల కారణంగా శనివారం 11కేవీ నూర్‌ఖాన్‌బజార్, దిల్‌సుఖ్‌నగర్ ఫీడర్ల పరిధిలోని పరిసర ప్రాంతాలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, శాలివాహననగర్, అబ్బాస్ వాటర్ ట్యాంకు ఫీడర్ల పరిధిలోని పరిసర ప్రాంతాలలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.